ఈనాడు
epaper.eenadu.net

# ఆరు కారిడార్లు.. 116.2 కి.మీ.

- రూ.32,237 కోట్ల అంచనాతో మెట్రో రెండోదశ ప్రాజెక్టు
- నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయ మార్గానికి సీఎం ఆమోదం
- రావిర్యాల మీదుగా ఫోర్త్‌సిటీకి ప్రతిపాదన
- హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాజధాని మెట్రోరైలు రెండో దశలోని ప్రతిపాదిత కారిడార్ల ఎలైన్‌మెంట్లు కొలిక్కి వచ్చాయి. ఆరింటిలో ఐదు కారిడార్లలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లకు తుది మెరుగులు దిద్దుతున్నారు. అన్ని కారిడార్లలో కలిపి 116.2 కి.మీ. మెట్రో మార్గాల నిర్మాణానికి రూ.32,237 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. విమానాశ్రయానికి వేర్వేరు మార్గాలను పరిశీలించినా.. నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం మార్గానికి సీఎం ఆమోదం తెలిపారు. వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలించిన అనంతరం విమానాశ్రయం నుంచి అవుటర్, రావిర్యాల మీదుగా ఫోర్త్‌సిటీకి మెట్రో ప్రతిపాదనను రెండో దశలోనే చేర్చారు. ఈ మేరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్.రెడ్డి ఆదివారం వివరాలు వెల్లడించారు. ట్రాఫిక్ అంచనాల విషయంలో హెచ్ఎండీఏ పరిధిలో కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) అధ్యయన నివేదిక కోసం ఎదురుచూస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం డీపీఆర్‌లను సమర్పించడానికి సీఎంపీ తప్పనిసరి అని చెప్పారు. ఈ ఐదు కారిడార్లకు రూ.24,237 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేసినట్లు వివరించారు.

### తొలుత కేంద్రానికి ఐదు కారిడార్ల డీపీఆర్‌లు..

వివిధ ప్రత్యామ్నాయాలపై లోతైన చర్చల తర్వాత రెండోదశ మార్గాలను ముఖ్యమంత్రి ఆమోదించారని ఎన్వీఎస్.రెడ్డి తెలిపారు. ఫోర్త్‌సిటీకి రావిర్యాల మీదుగా మెట్రో అనుసంధానానికి ఆకర్షణీయమైన సౌకర్యాలతో వినూత్న రీతిలో డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, సుమారు రూ.8వేల కోట్లు వ్యయమవుతుందని పేర్కొన్నారు. ఈ కారిడార్ మినహా మిగిలిన ఐదు కారిడార్ల డీపీఆర్‌లను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో కేంద్రానికి సమర్పిస్తామని తెలిపారు. ఇతర మెట్రోరైలు ప్రాజెక్టుల మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంయుక్త ప్రాజెక్టుగా చేపట్టేందుకు ప్రతిపాదించామన్నారు. కొన్ని నెలల్లోనే ఫోర్త్‌సిటీ వరకు 40 కి.మీ. మేర మెట్రో విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌ను సైతం కేంద్రం అనుమతులకు సమర్పిస్తామని చెప్పారు. ఇప్పటికే మూడు కారిడార్లలో 69 కి.మీ. మేర మెట్రో సేవలందిస్తోంది.



మెట్రో రెండోదశ కారిడార్ల గురించి వివరిస్తున్న హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

**కారిడార్-4 (విమానాశ్రయ మెట్రో కారిడార్)**
- నాగోల్ - చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు
- 36.6 కి.మీ.. 24 స్టేషన్లు
- 35 కి.మీ. ఆకాశ మార్గం, 1.6 కి.మీ. భూగర్భంలో
- విమానాశ్రయంలో భూగర్భ మెట్రోస్టేషన్ వస్తుంది.

**కారిడార్-5**
- రాయదుర్గం నుంచి విప్రో సర్కిల్ మీదుగా కోకాపేట నియోపొలిస్ వరకు
- 11.6 కి.మీ.. 10 స్టేషన్లు.

**కారిడార్-6**
- ఎంజీబీఎస్ నుంచి శాలిబండ మీదుగా చాంద్రాయణగుట్ట వరకు
- 7.5 కి.మీ.. 6 స్టేషన్లు

**కారిడార్-7**
- మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు
- 13.4 కి.మీ.. 10 స్టేషన్లు

**కారిడార్-8**
- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు
- 7.1 కి.మీ.. 6 స్టేషన్లు

**కారిడార్-9**
- శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ(స్కిల్ యూనివర్సిటీ) వరకు.
- 40 కి.మీ.

Date : 30/09/2024 EditionName : GREATER HYDERABAD PageNo :